www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 27 అక్టోబర్ 2024
5
వైఎస్ఆర్



వైవీయూ సిఐగా కృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్



యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారిగా ఆచార్య కృష్ణారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఛాంబర్‌లో వీసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. బోధన, బోధనేతర సిబ్బంది, వైవీయూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లు నూతన సిఐని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణారావు మాట్లాడుతూ అకడమిక్, రీసెర్చ్, అడ్మినిస్ట్రేషన్‌లో గత అనుభవాన్ని వినియోగించుకుని పరీక్షల విభాగాన్ని సమర్థవంతంగా నడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఉచిత గ్యాస్ కొందరికే?!



- జిల్లాలో 5,86,352 మంది అర్హులు
- 29 నుంచి బుకింగ్ సదుపాయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

దీపావళి పర్వదినం సందర్భంగా అమల్లోకి రానున్న ఉచిత గ్యాస్ కొందరికేనని తెలుస్తోంది. ప్రభుత్వం జిల్లాలోని తెల్లకార్డు దారులు అందరికీ ఉచిత గ్యాస్ పథకం వర్తిస్తుందని చెబుతోంది. లోగుట్టును గమనిస్తే ఆధార్ నెంబర్ పరిశీలన మెలిక పెట్టింది. ఆధార్ డేటా ఆధారంగా వార్షిక ఆదాయాన్ని పరిశీలించిన అనంతరం పలువురికి కోత విధించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయనే వాదన వినిపిస్తోంది. ఆధార్‌కార్డు పరిశీలనను నిబంధనల్లో చేర్చినట్లు తెలుస్తోంది. జిల్లాలో 5,86,352 మంది తెల్లకార్డుదారులు ఉన్నారు. 3.69 లక్షల మంది దీపం కనెక్షన్‌దారులు ఉన్నారు. క్రీమీలేయర్ తరహా నిబంధనలను అమలు చేసి లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆదాయానికి లింకు.. జిల్లాలో కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మల మడుగు, పులివెందుల, బద్వేల్ పట్టణాలు ఉన్నాయి. వీటి పరిధిలోని నివసించే వారికి నెలకు రూ.12 వేలు, రూరల్‌లో రూ.10 వేలు ఆదాయం కలిగిన లబ్ధి దారులు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులుగా నిర్ణయించింది. ఈలెక్కన జిల్లాలో 5,86,252 లక్షలు మంది అర్హులవుతారా, దీపం పథకం లబ్ధిదారులైన 3.86 లక్షల మందికి పరిమితం చేస్తుందా, లేక ఎంత మంది ఉచిత గ్యాస్ పథకానికి అర్హులవుతారో వేచిచూడాల్సి ఉంది.

29 నుంచి బుకింగ్!

ఈ నెల 29 నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్ సదుపాయాన్ని కల్పించింది. అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేసిన 24 గంటల నుంచి 48 గంటలలోపు గ్యాస్ నగదును ఖాతాల్లో జమ చేయనుంది. అక్టోబర్ 31 నుంచి మార్చి నెలాఖరు లోపు మొదటి సిలిండర్, ఏప్రిల్ ఒకటి నుంచి జూన్ నెలాఖరు నాటికి మూడవ సిలిండర్, జులై నుంచి సెప్టెంబర్ నెలాఖరు నాటికి మూడవ సిలిండర్‌ను సరఫరా చేసే అవకాశాలను పరిశీలిస్తోంది.

సిడిపిఒను తక్షణమే సస్పెండ్ చేయాలి

- గౌరవాధ్యక్షులు మనోహర్ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగన్వాడీ వర్కర్లను వేధింపులకు గురి చేస్తున్న కడప సిడిపిఒను తక్షణం సస్పెండ్ చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు అంజలీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ నగరంలోని సున్నపు బట్టీల సెంటర్‌లో పర్యవేక్షణ పేరుతో అంగన్వాడీ వర్కర్‌ను సిడిపిఒ బెదిరించి, భయభ్రాంతులకు గురి చేయడం వల్ల ఆమె అనారోగ్యానికి గురైందని తెలిపారు. ఆ వర్కర్‌కు ఏం జరిగినా కడప సిడిపిఒదే బాధ్యత అని హెచ్చరించారు. గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టిక ఆహార కాలం చెల్లినవి ఇచ్చిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకుండా అంగన్వాడీ వర్కర్లను బెదిరించడం దారుణమని పేర్కొన్నారు. గతంలోనూ సిడిపిఒ అంగన్వాడీ వర్కర్లను అనేక రకాలుగా బెదిరించిందని గుర్తు చేశారు. పోపుసామాన్ల పేరుతో మూడు శాతం డబ్బులు వసూలు చేసి అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఈ విషయం చాలా సార్లు పీడీ దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. దూరం సెంటర్ వెళ్లేవారికి ఛార్జీల కోసం ఒక్కొక్కరికి రూ.2 వేలు కడప కమిషనర్ సిడిపిఒ ఇచ్చినా ఆ మొత్తాన్ని వారి ఇవ్వలేదని తెలిపారు. అనారోగ్యానికి గురైన వర్కర్‌కు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే రాగి పిండి కాలం చెల్లినవి వెంటనే ఐసిడిఎస్ వారు స్వాధీనం చేసుకుని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు నగర అధ్యక్షులు పి. చంద్రారెడ్డి, అంగన్వాడీ యూనియన్ కడప అర్బన్ సెక్రటరీ వినీల, పోలమ్మ, సునీత, వెంగమాంబ, శాంతి, రామక్క, కమల్లమ్మ, సుశీల, దుర్గ, సుమలత, పుష్ప నాగవేణి రమాదేవి బ్యుల, లలిత ,సుభద్ర, ఉదయ్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

పోలీసు ఆయుధాలపై అవగాహన అవసరం : ఎస్పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు విధి నిర్వహణలో భాగంగా వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు నేరపరిశోధన విధానం తదితర విషయాలను విద్యార్థులకు తెలియజేయడానికి ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ఓపెన్ హౌస్‌లో భాగంగా బాంబు డిస్పోజబుల్ టీం, ఫింగర్ ప్రింట్, పోలీసు కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్స్, ఆయుధాల విడి భాగాల సమాచారం గురించి ఎకె 47, ఎస్ఎల్ఆర్ పిస్టల్, గ్లోక్ 17, కార్బన్, ఇన్సాస్ రైఫిల్, గ్యాస్ గన్, గ్రెనేడ్, ఫోరెన్సిక్, ఎస్ఓఎస్ ఎల్ తదితర విషయాల గురించి వివరించారు. బాడీ వర్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరా, వి. హెచ్. ఎఫ్ సెట్, రోబో డ్రైస్, లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, ను ప్రదర్శనలో ఉంచారు. బాంబ్ డిస్పోజల్ టీం వినియోగించే డీప్ సెర్చ్ మెటల్ డిటెక్టర్, టెలిస్కోప్ మ్యానిపులేటర్, రిమోట్ వైర్ కట్టర్ ను ప్రదర్శనలో ఉంచారు. డాగ్ స్క్వాడ్ బృందంలో జాగిలం నవీనంగా చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఎఎస్‌పి కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, ఎఆర్‌డిఎస్‌పి కడప డిఎస్‌పి ఎ.వెంకటేశ్వర్లు, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీహరి రెడ్డి, శివరాముడు, టైటస్, నగరంలోని సి.ఐలు, ఆర్ఎస్ఐలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలబెడతాం

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప



సభ్యత్వం పొందుతున్న వికాస్ హరికృష్ణ

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే కడప జిల్లాను మొదటి స్థానంలో నిలబెడతామని కడప ఎమ్మెల్యే మాధవి, కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని గాయత్రి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26 నుంచి 75 రోజులు నిర్వహిస్తామన్నారు. రూ, 100 తో పార్టీలో సభ్యత్వం ఎవ్వరైనా తీసుకోవచ్చున్నారు. ఒక లక్ష చెల్లించి పార్టీలో శాశ్వత సభ్యత్వం పొందవచ్చని చెప్పారు. రూ. 100 చెల్లించి పార్టీలో సభ్యత్వం పొందితే, సాధారణ పార్టీ సభ్యత్వం తో పాటు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించబడుతుందన్నారు. అనంతరం ఎముకలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న రఘు హైమన్ (3) వైద్య ఖర్చులకు రూ.5 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్, పత్రాలను బాలుని కుటుంబ సభ్యులకి అందించారు. టిడిపి సభ్యత నమోదును విజయంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదును చేపడుతున్నామని పేర్కొన్నారు

ఆయుర్వేదిక్ వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి-చెన్నూరు : స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొక్కరాయపల్లెలో చెన్నూరు ప్రభుత్వ వైద్యశాల ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. 9వ ఆయుర్వేదిక్ దినోత్సవాల సందర్భంగా డాక్టర్ రవికుమార్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై ఆయుర్వేద వైద్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమలత, ఉపాధ్యాయులు వీరనారాయణ, ఆసుపత్రి సిబ్బంది రాజశేఖర్, విజయ, సుబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

తూపల్లి సుబ్బయ్య మరణం పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి - బద్వేలు : ఐలమ్మ కాలనీలో నివాసమున్న సిపిఎం సీనియర్ నాయకులు, రజక సంఘం నియోజకవర్గ నాయకులు తుపల్లి సుబ్బయ్య శుక్రవారం అకస్మాత్తుగా మృతిచెందారు. . ఆయన మరణం సిపిఎం పార్టీకి తీరని లోటని వృత్తి దారుల సంఘం రాష్ట్ర నాయకులు మన్నూరు భాస్కరయ్య , సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గండికోట శివకుమార్ పేర్కొన్నారు. శనివారం సుబ్బయ్య అంత్యక్రియలకు హాజరై వారు మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలోని చాకలి ఐలమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన 25 సంవత్సరాల నుండి పార్టీలోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరా టాలు చేశారన్నారు. ఆయన మృతికి రజక వృత్తిదారుల సంఘం, సిపిఎం తరపున ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు విమోక్షమ్మ , ఐలమ్మ కాలనీ శాఖ కార్యదర్శి మస్తాన్‌బి, సిఐటియు బద్వేల్ కో–కన్వీనర్ పిసి కొండయ్య, గంప సుబ్బరాయుడు, రామలక్ష్మమ్మ, ఐలమ్మ కాలనీ శాఖ సెక్రెటరీ సుబ్బరాయుడు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

రాజుకు 'నట కళాతపస్వి' పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : మహాకవిత్రి మొల్ల సాహితీ పీఠం, శ్రీ భాగ్య రత్న ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రంగస్థల నటునిగా,లఘు చిత్ర దర్శకుడిగా ప్రసిద్ధులైన ఎవిఎస్ రాజు కు నటకళా తపస్వి 'పురస్కారాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రదానం చేయనున్నట్లు గానుగ పెంట మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కడప పాత కలెక్టరేట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న పెన్షనర్స్ కార్యాలయంలో ఉంటు ందని పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ .జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోబల్ సొల్యూషన్ వారు జాబ్ మేళాను నిర్వహిస్తున్నారన్నారు. డిగ్రీ డిప్లమో, బిటెక్ ఐటిఐ, ఇంటర్ ఉత్తీర్ణులై 18–35 సంవత్సరాలు మధ్య వయసు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా/రెస్యూమ్/ఆధార్‌తోపాటు సర్టిఫికేట్‌ల జిరాక్సు ప్రతులతో హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల లోని జెకెసి మెంటార్లు డాక్టర్ ఎన్. సారధి, 9347256400, సి.వి.రవీంద్రా రెడ్డి 9390052901ని సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ సర్దుబాటును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో వివిధ రూపాలలో మోపిన విద్యుత్తు, ఇతర భారాలను తగ్గిస్తామని, ఛార్జీలు పెంచబోమని 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలలకే సర్దుబాటు చార్జీలను రూ.6072 కోట్ల విద్యుత్ భారాన్ని పెంచాలని నిర్ణయం తీసుకోవడం సరికాదని సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) 2022- 23 సంవత్సరానికి సుమారు రూ.6072 కోట్ల భారం వేస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) నోటిఫికేషన్ జారీ చేసియడాన్ని తక్షణం ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలతో, మరోపక్క ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇలా విద్యుత్ బారాల మోపడం అమాను షమని తెలిపారు. 2022–23లో వాడిన విద్యుత్‌కు ఈ నవంబర్ నుంచి 2026 జనవరి వరకు యూనిట్‌కు దాదాపు రూ.0.83 పైసలు అదనంగా చెల్లిం చాలని తాజా ఉత్తర్వు విద్యుత్ రెగ్యు లేటర్ కమిషన్ ఇచ్చిందని ఇది విని యోగదారులకు పెను భారమని చెప్పారు. మాట తప్పి ప్రజలపై వేసిన ట్రూ ఆఫ్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభు త్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భారాన్ని సర్దుబాటు ఛార్జీల రూపంలో జనం నెత్తిన వేయటం దారు ణమన్నారు. ఏనాడో వాడుకున్న విద్యుత్తుకు ఆ తర్వాత కాలంలో అదనంగా వేసే సర్దుబాటు ఛార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమా వేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. మనోహర్, ఏ. రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

సర్దుబాటు ఛార్జీలు సరికాదు : కాంగ్రెస్

కడప : ఇంధనం విద్యుత్ కొనుగోలు ధర సర్దుబాటు ఛార్జీలు వినియోగదారుల నుండి వసూలు చేయడం సరైంది కాదని డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి అన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వివిధ రూపాలలో మోపిన విద్యుత్తు, ఇతర భారాలను తగ్గిస్తామని, ఛార్జీ పెంచబోమని 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలలకే సర్దుబాటు ఛార్జీలను సరికాదని పేర్కొన్నారు. వెంటనే నిర్ణయం కూటమి ప్రభుత్వం ఉపసంహించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

'కెఎస్ఆర్ఎం'కు న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి- కడప అర్బన్



గ్రేడ్ సాధించిన సందర్భంగా సంబరాల్లో కళాశాల యాజమాన్యం

అఖిల భారత విద్యా ప్రమాణాల మండలి (యుజిసి ఎన్ఎఎసి) వారు కడపలోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ ప్రకటించారు. ఈ గ్రేడ్ కళాశాలకు 2024, అక్టోబర్ నుంచి 2029 అక్టోబర్ వరకు అమలులో ఉంటుంది. ఇది కళాశాల విద్యా ప్రమాణాలు, పరిశోధన, శిక్షణలో చూపిన అంకితభావానికి గుర్తింపుగా నిలిచింది. ఈ ఘనత విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాలలో శనివారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి మాట్లాడుతూ ఈ విజయానికి ముఖ్య కారకులు సంస్థ అధినేతలు డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి నిరంతర కృషి పర్యవేక్షణ ముఖ్య కారణమన్నారు. భాగస్వామ్యులైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల విద్యా ప్రమాణాల అభివృద్ధి కోసం నిరంతర కృషి చేసిన ప్రతీ ఒక్కరూ ఈ ఘనతకు హక్కుదారులని పేర్కొన్నారు. కళాశాల ఎమ్‌డి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లడుతూ న్యాక్ ఎప్లస్ గ్రేడ్ కళాశాలకు ఉన్నతమైన స్థానం కల్పించడంతో పాటు భవిష్యత్ తరగతుల కోసం అత్యుత్తమ విద్యా వనరులను అందించడానికి మరింత శక్తి ఇస్తుందని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్, ట్రేజరర్ కందుల రాజేశ్వరీ ఈ విజయానికి కారణమైన వారందరిని అభినందించారు. కళాశాల నిర్వహించిన ఈ విజయోత్సవంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్ ప్రసాద్, డీన్‌లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది

ప్రజాశక్తి - కడప సిటీ : సమాజంలో వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని అంకితభావంతో వైద్య విద్య నేర్చుకొని సేవా భావంతో వైద్య సేవలు అందించాలని అప్పుడే ఉద్యోగ భవిష్యత్తు ఉంటుందని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ అన్నారు. నూతన వైద్య విద్యార్థుల చేత వైట్ కోట్‌లను ధరింప చేసిన తర్వాత వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వైద్యవృత్తి పట్ల అంకితభావంతో ఉండి నిత్యం వైద్య విద్యార్థిగా భావిస్తూ నైపుణ్యాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, వైద్య అధ్యాపకులు, నూతన వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి- వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లిలో చేపడుతున్న రోడ్ల పనులను ఎంజిఎన్ఆర్ఇ ఎస్‌జిఎస్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ విజయభాస్కర్, ఎపిడి సోమశేఖర్ రెడ్డి పరిశీలించారు. శనివారం రూ. 5 ఐదు లక్షల వ్యయంతో నిర్వహిస్తున్న రోడ్డు పనులు పరిశీలించి కాంట్రాక్టర్‌కు సూచనలు సలహాలిచ్చారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. లాభాపేక్ష తో కాకుండా సేవా భావంతో మన్నికంగా ఉండే విధంగా సిసి రోడ్లు పూర్తి చేయాలన్నారు. వారి వెంట ఎపిఒ సుధారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ ఓబయ్య పాల్గొన్నారు.

శాస్త్రీయంగా పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - గోపవరం

పంట కోత ప్రయోగాలు శాస్త్రీయంగా నిర్వహించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. నాగరాజు పేర్కొన్నారు. బద్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేల్, గోపవరం, ఆట్లూరు, సిద్ధవటం, మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్ర వ్యవసాయ సహాయకులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రబీలో పంటల బీమా, ఇ పంట నమోదు, బీడు భూములను సాగులోకి తేవడం, పంటకోత ప్రయోగాకల నిర్వహణ, ఎరువుల సరఫరా వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈనెల 29,30 తేదీలలో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డెమోలు నిర్వహించి రైతులకు ఆధునిక పద్ధతులపై వివరించాలని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ ఆగ్రీ ల్యాబ్‌ను సందర్శించి లక్ష్యాలు, ప్రగతిని సమీక్షిస్తామన్నారు.

నేడు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జెవివి ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో చెకుముకి సంబరాలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలబయన్న తెలిపారు. శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా కెఎస్ఆర్ఎమ్ ఇంజినీరింగ్ కళాశాల ఎమ్‌డి డాక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి, ఎంఇఒ సునీత, వైవీయూ ప్రొఫెసర్ వెంకట రామిరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి జిల్లా స్థాయికి ఎంపికైన ఒక ప్రభుత్వ పాఠశాల, ప్రయివేట్ పాఠశాల నుంచి ఒక్కొక్క టీం చొప్పున జిల్లా స్థాయి సంబరాల్లో పాల్గొంటారని చెప్పారు. జిల్లా స్థాయిలో విజేతలైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరిగి తార్కికంగా ఆలోచించడం నేర్చుకుంటారన్నారు. సమావేశంలో జెవివి పట్టణ అధ్యక్షులు ఎస్. శివరాం, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి - కడప : ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం అవకాశం కల్పించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధాతథంగా పనిచేస్తాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎల్ఐసి ఏజెంట్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-కాశినాయన



విజయభాస్కర్ దంపతులను సన్మానిస్తున్న మేనేజర్లు

మార్కాపురం గ్రామానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ గంధం విజ యభాస్కర్‌ను ఆ శాఖ అధికారులైన కడప జిల్లా సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, బద్వేల్ శాటి లైట్ బ్రాంచ్ మేనేజర్ జనార్దన్ శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయభాస్కర్ ఎల్ఐసిగా ఏజెంట్‌గా చేరినప్పటి నుంచి మంచి క్రమశిక్షణతో విధులు నిర్వహి స్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే 2024 –25 సంవత్సరానికి సంబంధించి ఎల్ఐసి ప్రవేశపెట్టిన కాంపిటీషన్‌లో బిజినెస్‌లో మంచి ప్రతిభ కనబరిచినందుకు సన్మానం చేశామన్నారు. అనంతరం విజయభాస్కర్‌ను, ఆయన సతీమణిని శాలువాలు, పూలమాలతో సన్మానించారు.

షర్మిల మాటలు.. చంద్రబాబు స్క్రిప్ట్

వైసిపి జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప

పార్టీ కోసం శ్రమించిన వారికే కీలక పదవులు వస్తాయని, వైఎస్. జగన్, షర్మిల ఆస్తి గొడవల విషయంలో చంద్రబాబునాయుడు రాసిచ్చిన స్క్రిప్ట్‌నే పిసిసి అధ్యక్షులు షర్మిల చదువుతున్నారని వైసిపి కడప జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శనివారం కడప వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసులో ఉన్న ఆస్తులు బదలాయింపు సాధారణంగా జరగదని, జగన్ బెయిల్ రద్దు చేయించే కుట్రలకు షర్మిల తెర తీశారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు పన్నాగం ప్రకారం షర్మిల నడుస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం దుష్ట పాలన లేక సూపర్ పాలన అనేది ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం వైసిపి బలోపేతంపై దృష్టి సారించామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం పరిస్థితి దారుణంగా ఉందన్నారు. కూటమి ప్రభు త్వంలో రూ. 6 వేల కోట్లు విద్యుత్ ఛార్జీలు పెంచడానికి రంగం సిద్ధం చేశారు అన్నారు. గత ప్రభుత్వంలో జగన్ తప్పుల వల్లే విద్యుత్ ఛార్జీల పెంపు అని విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మేం రైతు భరోసా కేంద్రాలు పెట్టి రైతులను ఆదుకుంటే, నేడు క్రాప్ ఇన్స్యూరెన్స్ కూడా రైతులే కట్టుకోవాలని నిర్ణయించారని విమర్శించారు. సమావేశంలో కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, కమలాపురం, వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌షా, రాజంపేట ఎమ్మెల్యే ఆకెపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే సుధా , మాజీ ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జగన్ ఆస్తిలో షర్మిల వాటా కోరడం సమంజసం కాదు : సతీష్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆస్తిలో ఆయన సోదరి వైఎస్ షర్మిల వాటా అడగడం సమంజసం కాదని వైసిపి ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం కడప ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ వ్యాపారాల్లో షర్మిలకు వాటాలు లేవన్నారు. తండ్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి బతికుండగానే ఆస్తి పంపకాలు జరిగాయని, జగన్ కంటే షర్మిలకే ఎక్కువ ఆస్తి ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు కుట్రల వల్లే జగన్ జైలుకు వెళ్లారు. జగన్ పాపులారిటీ తట్టుకోలేక, ప్రజలకు ఏమీ చేయలేక ఇలాంటి నీచ రాజకీయాలకు ఒడిగడుతున్నారని విమర్శించారు.

రేపు మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలో మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపాలిటీల వద్ద ఈనెల 28 ఉదయం 10 గంటలకు ధర్నాలు నిర్వహించనున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. విజయభాస్కర్, జిల్లా కోశాధికారి ఎస్. గోపి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి .విజయ్ కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్లు, డైలి వెజ్, పర్మనెంట్ ఉద్యోగులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. మున్సిపల్ అన్ని రకాల కార్మికులు మున్సిపాలిటీల వద్ద నిర్వహించే ఆందోళనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మొక్కుబడే!

ప్రజాదృష్టి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిని తలపించింది. జిల్లాలోని 10 మంది ఎమ్మెల్యేల్లో ఇద్దరు, ఇద్దరు ఎంపీలు, ఇద్దరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రి, జిల్లా రెగ్యులర్ కలెక్టర్ లేకుండానే మూడు గంటల వ్యవధిలో ఆరు నుంచి ఎనిమిది విభాగాల చర్చతో ముగించారు. 2024–25 ఖరీఫ్ సీజన్ గల్లంతైంది. రబీ సీజన్‌పైనే అందరి ఆశలు నెలకొన్న నేపథ్యంలో లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది. పంటల సాగుకు అవసరమైన విత్తన సబ్సిడీ దగ్గర నుంచి పురుగు మందులు, ఎరువులు, సాగునీరు వంటి అంశాలపై లోతుగా చర్చించాల్సి ఉంది. మొస్తరుగానే చర్చించినప్పటికీ జిల్లా బాధ్య కలెక్టర్, ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రి లేకపోవడం అస్పష్టంగానే ముగిసింది. ఇద్దరు మినహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, పలువురు జడ్‌పిటిసిలు, ఎంపిపిలు గైర్హాజరయ్యారు. పంచాయతీ రాజ్ వ్యవస్థకు బలీయ చిహ్నమైన స్థానిక సంస్థలను తీర్చిదిద్దాల్సిన నాయకత్వం నీరసపరచడం ఆందోళన కలిగిస్తోంది. కేబినెట్ మీటింగ్ నేపథ్యంలో ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రి గైర్హాజరు కావడం సబబే. ఎమ్మెల్యేలు, ఎంపీలకు గైర్హాజరుకు సరైన కారణాలు లేవని చెప్పవచ్చు. వీరికి వ్యాపారాలే పరమావధిగా మారినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇటువంటి ధోరణులు ప్రబలడం ఆందోళనకరం. ఎగువ సభలకు చెందిన సభ్యులు దిగువ సభలకు హాజరై ప్రజాస్వామిక పద్ధతులు నేర్పించడం, ప్రజల సమస్యల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరం. ఇటువంటి అనుభవం శాసనసభల్లో చట్టాలు చేయడానికి ఎంతోగానో ఉపకరిస్తాయని చెప్పవచ్చు. ఇటువంటి అవకాశాలను విస్మరించి సొంత ప్రయోజనాలకు తాకట్టు పెట్టడం ఆందోళనకరం. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నిర్వాకాల కారణంగా కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, దీనిపై కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసి కార్మికుల రూ.14 వేల వేతనంలో రూ.ఐదు వేలు దోచుకోవడమేమిటని నిలదీశారు. సమాజం ఎలా పురోగమిస్తుందో ఆలోచించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దోపిడీ విధానాల కారణంగా సమాజంలో అశాంతి నెలకొనే ప్రమాదం పొంచి ఉందని, తిరోగామిక విధానాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉరుముతోందని చర్చకు తెరతీయడం హర్షణీయం. సామాన్యులకు సంబంధించిన అంశాలపై చర్చ చేయాల్సిన సమయంలో జిల్లా రాజకీయ నాయకత్వం అందుబాటులో లేకపోవడం విస్మయాన్ని కలిగించింది. వైసిపి హయాంలో కొప్పర్తి పారిశ్రామికవాడకు కేటాయించిన ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ పార్కును మంగళగిరికి తరలిస్తూ జీవోను విడుదల చేయడం ఆందోళనకరం. దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించడం జుగుప్సాకరం. రాష్ట్రంలోని కూటమి సర్కారుకు ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ పార్కు అత్యవసరమైతే కేంద్రప్రభుత్వం నుంచి తెచ్చుకోవాలి గానీ, ఇక్కడి నుంచి తరలించుకోవడం దిగ్భ్రాంతిని కలిగించింది. వికృత క్రీడలతో రాజకీయంగా నష్టపోవడమే తప్పా, ఒరిగిందేమీ ఉండదని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రచయితలు

స్థానిక చరిత్రను చిత్రపటాల రూపంలో తేవాలి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు నియోజకవర్గ చరిత్రను మైదుకూరు పట్టణ రహదారి గోడలపై చిత్రీకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డిని రచయిత, చరిత్ర పరిశోధకులు బొమ్మిశెట్టి రమేష్, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య కోరారు. ఆ మేరకు శనివారం వారు కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర, అల్లాడుపల్లె వీరభద్ర స్వామి, సిద్దయ్యగారి మఠం, లంకమల అభయారణ్య అత్యంత ప్రసిద్ధి చెందిన కలివికోడి, రాయలసీమ పాలెగాళ్ల వ్యవస్థలో ఏకైక మహిళా పాలెగత్తె వన్నూరమ్మ, శ్రీనాగ మల్లేశ్వరస్వామి కొండల్లోని బుద్ధిని పాదాలు, నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ మొండి భైరవ కొండయ్య స్వామి, సీఎల్ బావి, తెల్లనీళ్ల కుంట, బ్రహ్మసాగర్, కెసి కాలువ, అంబతల్లి, యొద్దడుగు కనుమ, చింతకుంట చెరువు, జాండ్లవరం కోట, ముక్కొండ, దువ్వూరు చరిత్ర, వనిపెంట శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి విశేషాలను చిత్రపటాల రూపంలో చరిత్రను వర్ధమాన, భవిష్యత్ తరాలకు సులభంగా తెలపటానికి అవకాశం ఉందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా బస్సు ప్రాంగణంలో హోర్డింగ్స్ ఏర్పాటు చేసి తద్వారా చరిత్రను తెలపవలసిన అవసరం ఉందని సూచించారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ విషయాన్ని మున్సిపల్ సమావేశంలో చర్చించి స్థానిక కవులు, రచయితలతో కూడా సంప్రదించి సాధ్యమైనంతవరకు చరిత్రను భావితరాలకు తెలియజేసే ప్రయత్నం చేస్తామన్నారు.



గుణవంతరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ఘనంగా గుణవంతరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ముద్దనూరు

సామాజిక కార్యకర్త డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి కుమారుడు, యువ నాయకులు కటికరెడ్డి గుణవంతరెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం ఆయన నివాసం వద్ద కుటుంబ సభ్యులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో గుణవంతరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి వెన్నపూస లక్ష్మికాంతమ్మ, వినోద్, ఓబులేసు, శివశంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఉమా మహేశ్వరరెడ్డి, దానం, నాయుడు, సుబ్బారాయుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మహాత్మా జ్యోతిరావు పూలే వనిపెంట గురుకుల పాఠశాలలో స్టాఫ్‌నర్స్ పోస్ట్ భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జమ్మలమడుగు గురుకుల పాఠశాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిఎన్ఎం, బిఎస్సి నర్సింగ్ చేసిన మహిళా అభ్యర్థులు నవంబర్1న సాయంత్రంలోపు అభ్యర్థులు వారి ఒరిజినల్ పత్రాలను తీసుకురావాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్



గాయపడిన కందుల వెంకట రమణారెడ్డి, మృతి చెందిన గంగాధర్‌రెడ్డి

బైక్‌ను ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

- కొడుకు అక్కడికక్కడే మృతి - తండ్రికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గండి రోడ్డులోని మూలవంక సమీపంలో బైకును ఇసుక ట్రాక్టర్ ఢీకొన్న దుర్ఘటనలో కొడుకు అక్కడిక్కడే మృతి చెందగా, తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. వీరపునాయనిపల్లె మండలం మొయిళ్లచెరువు గ్రామానికి చెందిన తండ్రికొడుకులు కందుల వెంకట రమణారెడ్డి, కందుల గంగాధర్‌రెడ్డి(45)తమకు ఉన్న రెండు ఎకరాలు పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పాడి ఆవులు పెట్టాలనే ఉద్దేశంతో వాటిని కొనుగోలు చేసేందుకు శనివారం వారు గ్రామం నుంచి చక్రాయపేటకు బుల్లెట్ మోటర్ బైకులో బయల్దేరారు. వేంపల్లెలోని గండి రోడ్డులో ఉన్న మూలవంక సమీపంలోకి రాగానే.. నందిపల్లె గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా బుల్లెట్ మోటర్ బైకును ఢీకొంది. బైకులో ప్రయాణం చేస్తున్న తండ్రి, కొడుకు కిందపడి పోయారు. బాల గంగాధర్‌రెడ్డికి బలంగా దెబ్బ తగలడంతో అక్కడక్కడే మృతి చెందాడు. మోటర్ బైకులో వెనుకవైపు కూర్చుని ఉన్న మృతుడి తండ్రి వెంకట రమణారెడ్డికి ఎడమ కాలు విరిగింది. ఇసుక ట్రాక్టర్ నిలబెట్టకుండా వెళ్లిపోయింది. సంఘటనాస్థలాన్ని పోలీసులు చేరుకుని గాయపడిన వెంకట రమణారెడ్డిని 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలంలో రక్త గాయాలతో తీవ్రంగా గాయపడిన వెంకట రమణారెడ్డిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. సమాచారం తెలుసుకున్న బంధువులు సంఘటనాస్థలంలో కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాన్ని పరిశీలించిన టిడిపి నేతలు

మూలవంక సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే టిడిపి నాయకులు మహమ్మద్ షబ్బీర్, మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్, డాక్టర్ కరీముల్లా, పీరా సాహెబ్, గొటూరు నాగభూషణం, మహబూబ్ షరీఫ్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రజల ప్రాణాలను హరిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అధికారులు నియంత్రించాలని వారు కోరారు. ఇసుక డంప్‌లు ఏర్పాటు కోసం పోటాపోటీగా ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేస్తూ ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకోవడం బాధాకరమన్నారు.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : తులసిరెడ్డి

రోడ్డు ప్రమాదంలో మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. స్థానిక గండి రోడ్డులోని మూలవంక వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొని బాల గంగాధర్‌రెడ్డి మృతి చెందగా.. విషయం తెలుసుకున్న తులసిరెడ్డి స్థానిక ఆస్పత్రిలో మృతదేహాన్ని సందర్శించి, బంధువులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఇసుక ట్రాక్టర్లు అతి వేగంగా వెళ్లకుండా అధికారులు నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న, రమణ, వేమా రాజా పాల్గొన్నారు.

వీధి దీపాలు ఇలా.. వెలగకపోతే ఎలా..?

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక నిధుల ద్వారా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోంది. క్షేత్రస్థాయిలో సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకవడంలేదు. మురుగు పారుదల వ్యవస్థ, వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక నిధుల ద్వారా దళిత కాలనీలో అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నా తమ సమస్యలు ఏ మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుల్లూరు పంచాయతీలోని పుల్లూరు దళితవాడలో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. వీధిదీపాలు వెలుగుకు నోచుకోకపోవడంతో రాత్రివేళల్లో అంధకారంలో ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. పంచాయతీలలో వీధిదీపాలు వెలుగుకు నోచుకోవడం లేదని, మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా చిన్నపాటి సమస్యల్ని కూడా ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అధికారుల్లో బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్య ధోరణి కారణంగానే తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని పుల్లూరు దళిత కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వీధిదీపాలు మరమ్మతుకు గురైన వాటిని బాగు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



పుల్లూరులో వెలుగుకు నోచుకోని ఓ వీధి దీపం

మహిళలకు రక్షణ కల్పించాలి : ఎస్ఎఫ్ఐ



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థినులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులకు రక్షణ కరువైందని, ఇంకా ఎంతమంది విద్యార్థినులు ఆకతాయిలకు బలి కావాలని ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ సభ్యురాలు స్వప్న, స్వాతి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద శనివారం విద్యార్థినిలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై అనేక రకాలుగా అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా, రాష్ట్రంలో ఉన్న మహిళల చట్టాలు ఎక్కడ ఉన్నాయో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికే దిశా చట్టం అని చెప్పి ఆ చట్టం దిక్కులు లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైనా మహిళలకు భద్రత కల్పిస్తారని ఆశతో ఉన్నా.. సరైన భద్రత కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప, వాటిని కట్టడి చేసే చట్టాలు తీసుకొని రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షిస్తామని చెబుతున్నారేగానీ అవి ఎక్కడా కనిపించడంలేదన్నారు. తప్పు చేసిన వారిని రిమాండ్‌కు తరలించడమే కానీ.. శిక్షలు పడినట్లు కనపడడం లేదన్నారు. ఇప్పటికే మన ఉమ్మడి జిల్లాలో ఇద్దరి యువతులు చనిపోయారన్నారు. ఇప్పటికైనా విద్యార్థినులు, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకురాళ్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలపై మాట తప్పిన ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యుత్ ఛార్జీల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచం, తగ్గిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని చెప్పారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కాగానే విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా ఏకంగా ఒకేసారి వినియోగదారులపై రూ.6,073 కోట్లు అదనపు భారాన్ని మోపడం శోచనీయమన్నారు. నవంబర్ నుంచి జనవరి వరకు ఈ భారాన్ని మోయాలని జిఒ జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులు కట్టలేక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. విద్యుత్ తీగలు పట్టుకోవాల్సిన అవసరం లేదని, బిల్లు ముట్టు కుంటేనే షాక్ కొడుతుందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం పెం చిన విద్యుత్తు ఛార్జీలను వెంటనే ఉపసంహరించు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వానికి ప్రజలు షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తారని తెలిపారు.



జీవామృతం తయారీ విధానాన్ని చూపిస్తున్న అధికారులు

జీవామృతంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - వేముల

జీవామృతంతో అధిక దిగుబడులు సాధిం చవచ్చని అధికారులు సూచించారు. వేముల గ్రామంలో రైతు గంగా ధరకు 200 లీటర్లు జీవామృతం తయారు చేసే విధా నాన్ని ప్రదర్శించారు. 200 లీటర్ల డ్రమ్ము తీసుకొని 10 కిలోల పేడ, 10 లీటర్లు గోవు మూత్రం, రెండు కిలోల నల్ల బెల్లం, రెండు కిలోల పప్పు దినుసుల పిండి, గుప్పెడు పుట్ట మట్టి కలిపి తయారీ విధానాన్ని వివరించారు. ఉదయం, సాయంకాలం సమ యంలో కర్ర సాయంతో కలపాలన్నారు. నాలుగు రోజుల తర్వాత వాటిని పంటకు ఉపయోగించాలని ప్రకృతి వ్యవసాయ అధికారి శివాఅర్జున్‌రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి రామ్మోహన్ నాయుడు వివరించారు. కార్యక్రమంలో నారుబోయిన రాధాకృష్ణ, వెంకటేష్, రాజీవ్‌రెడ్డి, నారుబోయిన గంగాధర, రామకృష్ణ, సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని నిలదీయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిలదీయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఈనెల 29,30న డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు కడపలో జరుగుతాయని తెలిపారు. స్థానికంగా సమావేశాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కడప కొప్పర్తి పారిశ్రామిక కారిడార్‌లో ఉన్న ఎంఎస్ఎంఇ టెక్నాలజీ కేంద్రాన్ని కూడా అమరావతికి రాష్ట్ర ప్రభుత్వం తరలించడం ఇక్కడి ప్రాంత ప్రజలను అవమానించడమే అన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కలగాలంటే ఉపాధి పరిశ్రమ ఏర్పాటు ఒక్కటే మార్గమన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్, ప్రొద్దుటూరు పట్టణ నాయకులు విశ్వనాథ్, ఓబులేసు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ ప్రేమానందరెడ్డి

విద్యార్థులు ఒత్తిడికి లోను కాకూడదు

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ఉండాలని అవేర్‌నెస్ ట్రైనర్ ప్రేమానందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించుకోవాలంటే విద్యార్థులకు వ్యాయామం, యోగా అవసరమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణతో ఉండాలని కోరారు. సమస్యలు ఎదురైతే స్నేహితులకు, తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ఇలా చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుందన్నారు. బోధించే పాఠాలపై ఏకాగ్రత పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యాన్ని కూడా కాపాడు కోవాలన్నారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానో పాధ్యాయుడు చెరుకూరి శ్రీనువాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మూలధనం విడుదల చేయాలి : వైసిపి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం మహిళల అభ్యున్నతి, ఆర్థిక బలోపేతం కోసం ఏర్పాటు చేసిన మహిళా చేయూత మార్ట్ కు వెంటనే ప్రభుత్వ వాటా కింద తక్షణం రూ.20 లక్షలు విడుదల చేయాలని వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, అగ్రహార సహకార సంఘం మాజీ అధ్యక్షులు పివి రాఘవరెడ్డి కోరారు. ఖాజీపేటలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వ హయాంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వైఎస్ఆర్ చేయూత మార్ట్‌ను రూ.24 లక్షలతో ఏర్పాటు చేశారన్నారు. దాదాపు 820 పొదుపు సంఘాలున్నాయన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసినా ఆర్థిక వ్యాపార లావాదేవీలకు సంబంధించి ఆడిట్ నిర్వహించకపోవడంతో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరామన్నారు. మార్ట్ నిర్వహణ ఖర్చులుపోనూ రూ.11 లక్షల వరకు ఆదాయం వచ్చిందని, ఆ మొత్తాన్ని ఆర్థిక సంవత్సరం ఆడిట్ తర్వాత గ్రూప్ సభ్యులకు పంచనున్నట్లు అధికారులు వెల్లడించారని పేర్కొన్నారు. కమలాపురం, పోరుమామిళ్ల, చింతకొమ్మదిన్నె, వేంపల్లి మండలాలకు ప్రభుత్వం వాటా కింద రూ.20 లక్షలు విడుదల చేసిందని, తక్షణం ఖాజీపేటకు కూడా నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు ఏటూరు ఏనుగు శివారెడ్డి, కాంట్రాక్టర్ దుగ్గిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


రైతుబజార్‌లో దుకాణాల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మార్కెట్ యార్డ్‌లోని రైతుబజార్‌లో దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవచ్చని రైతుబజార్ ఎస్టేట్ అధికారి బి.రుచిత తెలిపారు. శనివారం మార్కెట్ యార్డ్‌లోని రైతుబజారులో ఆమె మాట్లాడుతూ రైతు బజారులో 22 స్టాల్స్, 13 దుకాణ గదులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ పండ్లు, కూరగాయలు, నిత్యావసర సరుకులు, పూలు, ఇతరత్రా విక్రయించుకోవచ్చునని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నిర్దేశించిన మేరకు నెలసరి బాడుగ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు 15 రోజుల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివ రాలకు మార్కెట్ యార్డ్‌లోని రైతు బజారులో ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సంప్రదించాలని ఆమె సూచించారు.

ఘనంగా ముగిసిన 2కె24 యంత్ర కార్యక్రమం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్



మాట్లాడుతున్న సిఐ వెంకటరమణ

జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల యంత్ర 2కే 24 కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసిందని మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. ముఖ్య అతి ధులుగా పులివెందుల రూరల్ సిఐ ఎన్.వి.వెంకట రమణ, హార్టికల్చర్ కళాశాల ప్రిన్సిపల్ రామాజంనేయరెడ్డి, బిసి రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ పి.ప్రసాద్ హాజరయ్యారు. వర్క్‌షాప్, ఈవెంట్స్‌లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిధి వెంకటరమణ మాట్లాడుతూ వాహనాల పనితీరు, మనిషి ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని, చెడు అలవాట్లకులోను కావద్దని సూచించారు.

నేడు తుమ్మెద పదాలు పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చైతన్య సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో కాశీవరపు వెంకట సుబ్బయ్య రచించిన తుమ్మెద పదాలు పుస్తకావిష్కరణ సభ ఆదివానం స్థానిక అనిబిసెంట్ పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి కాశీవరపు రాజేంద్ర కుమార్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. సభాధ్యక్షులుగా ప్రముఖ అవధాన కవి నరాల రామారెడ్డి, ముఖ్య అతిథులుగా ప్రముఖ పద్యకవి ఎసి దస్తగిరి, ప్రముఖ అనువాద రచయిత కొమ్మిశెట్టి మోహన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు, ఆత్మీయ అతిథులుగా సాహితీవేత్తలు సి.వి.సురేష్, భూక్యా గోపాల్ నాయక్, పల్లా రామారావు, హేమాద్రి సాగర్, గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, సమీక్షకులుగా కొత్తపల్లి శీను పాల్గొంటారని తెలిపారు. సాహితీ వేత్తలు, సాహిత్యాభిమానులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

చెముళ్లపల్లెలో చిన్నారి మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని చెముళ్లపల్లె గ్రామంలో మూడేళ్ల కరీముల్లా అనే చిన్నారి మతి చెందింది. గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుక కార్యక్రమంలో భోజనం అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది. శుభ కార్యక్రమం సందర్భంగా ఇంటి అలంకరణ కోసం రంగులకు ఉపయోగించే టిన్నర్ తాగి మృతి చెందినట్లు సమాచారం. తాగేనీర అనుకుని భావించి టిన్నర్ సేవించినట్లు కొందరు పేర్కొంటున్నారు. చిన్నారి మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ముకుందరెడ్డి

మండల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపిడిఒ ముకుందరెడ్డి కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులు శాఖల వారీగా వారు చేపట్టిన, చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎస్వీ గిరి కాలనీ పక్కన ఉన్న కాల్వలోని మురుగునీరు వల్ల కాలనీ వాసులు జ్వరాల బారిన పడు తున్నారన్నారు. మురుగునీరు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఎంఇఒ నాగేశ్వర నాయక్ మాట్లాడుతూ కొర్రపాడు మెయిన్ ప్రాథమిక, దళిత వాడ ప్రాథమిక పాఠశాలకు భవనాలు లేక ఒక పాఠశాల ఇంటి వరండాలో, మరొకటి చెన్నకేశ స్వామి దేవాలయంలోని రేకుల షెడ్డులో నడిపి స్తున్నామన్నారు. ఆ రెండు పాఠశాలలకు భవనాలు మంజూరు చెయ్యాలని సభలో అధికారుల దృష్టికి తెచ్చారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్క రించేందుకు కృషి చేస్తానని ఎంపిడిఒ అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ, పశు సంవర్ధక శాఖ అధికారులు

పశుగణనకు సహకరించండి

- పశు సంవర్ధక శాఖ ఎడి డాక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పశు పోషకులు ప్రతి ఒక్కరూ పశుగణనకు సహకరించాలని జమ్మలమడుగు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఆర్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆర్‌డిఒ సాయి శ్రీ, ఎంపిడిఒ సయ్యద్ ఉన్నిసా చేత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ పశుగణన వలన పాడి పరిశ్రమలో ఎంతమంది భాగస్వాములై ఉన్నారో తెలుస్తుందన్నారు. శిక్షణ పొందిన సర్వే సిబ్బందితో కలసి 21వ పశుగణన సర్వే చేస్తున్నామన్నారు. 2025 ఫిబ్రవరి 28 వరకు పశుగణన నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని రకాల పశు సంపదను ఈ గణనలో లెక్కిస్తామన్నారు. పశువులు గల ప్రతి ఒక్కరూ సర్వే వారికి సహకరించి నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పశు వైద్యశాల డాక్టర్స్ దస్తగిరమ్మ, జాన్ సుధాకర్, రాఘవేంద్ర, హరివింద రెడ్డి, ఎన్యుమరేటర్స్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : పశువుల సమగ్ర సమాచారం అందించి పశుగణనకు సహకరించాలని పశువైద్య సంచాలకులు కె.వెంకటసుబ్బయ్య కోరారు. కార్యక్రమంలో పలుగురాళ్లపల్లి, పెద్దిరాజుపల్లి పశువైద్యాధికారి డాక్టర్ బి.నిత్యానంద్, బి.కోడూరు, ప్రభలవీడు డాక్టర్స్ డాక్టర్ ఎం.భరద్వాజ్, డాక్టర్ ఎం.లక్ష్మినరసయ్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



ఆర్‌డిఒకు వినతి పత్రం అందిస్తున్న గురుమూర్తి యాదవ్

ఆధార్ అప్డేట్ కేంద్రాలను పట్టణంలో ఏర్పాటు చేయాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు గౌతమబోయిన గురుమూర్తి యాదవ్ తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గురుమూర్తి యాదవ్ మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల డేటాను నమోదు చేసుకొనేందుకు ఆధార్ అప్డేట్ చేయించుకోవాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారన్నారు. ఆ మేరకు తల్లిదండ్రులు బయటి ప్రాంతాలకు తమ పనులను వదిలిపెట్టి వెళ్ల వలసి వస్తోందన్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ, మండల కేంద్రం కావడంతో అనేక పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం కూడా వివిధ రకాల స్కీంల నిమిత్తం సెల్ నెంబర్‌ను ఆధార్‌కు లింకు చేయించుకునేలా చేస్తున్నారన్నారు. పై విష యాలను దృష్టిలో ఉంచుకొని జమ్మలమడుగు పట్టణంలో రెండు ఆధార్ అప్డేట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ఇందుకు ఆర్‌డిఒ స్పం దిస్తూ ఆధార్ అప్డేట్ సెంటర్లకు తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

టిడిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని ఆ పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి కోరారు. పార్టీ సభ్యత్వ నమోదును శనివారం ఆయన మండల పరిధిలోని గూడెం చెరువులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త సభ్యత్వ నమోదు వలన కలిగే లాభాలను వివరించాలన్నారు. ప్రజలను చైతన్యపరిచి తెలుగుదేశం పార్టీ కుటుంబంలోకి అత్యధిక సంఖ్యలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, గూడెంచెర్వు నాయకులు బాలు, ఖాదర్, శ్రీనివాసులు, శివారెడ్డి, పొన్నతోట బ్రదర్స్, గుడ్ల సురేష్, రవి, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టిడిపితోనే భవిష్యత్...: ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : టిడిపితోనే భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం పొందాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఆసం రఘురామిరెడ్డి, వియస్ ముక్తి యార్, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంప్యూటర్లు వితరణ

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు తహశీల్దార్ కార్యాలయానికి మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమారుడు కటికరెడ్డి గుణవంతరెడ్డి పుట్టినరోజు సందర్భంగా రెండు కంప్యూటర్లు, ప్రింటర్లు వితరణ చేశారు. వీటి విలువ దాదాపు రూ.80వేలు ఉంటుంది. కార్యాలయ అభివృద్ధికి చేయూత నిచ్చిన దాతలను తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.



కంప్యూటర్లు వితరణ చేస్తున్న గుణవంతరెడ్డి